కథానిక

# చెర వీడిన హృదయాలు

"కరుణాకర్ ఎప్పుడొస్తున్నాడు తిరిగి" స్వరూప్.

"ఎప్పుడొచ్చేదీ ఖచ్చితంగా తెలియదు. అయితే త్వరలోనే వస్తున్నాడు" ఉష.

ఆమె మౌనంగా వుండిపోయింది. చేతి వేలికి అందంగా మెరుస్తున్న ఉంగరాన్ని అటు ఇటూ తిప్పుతూ ఏవో ఆలోచనల్లో పడిపోయింది.

నెమ్మదిగా తలెత్తింది... స్వరూప్.

"ఏం చేయాలో తోచడం లేదు స్వరూప్" అంది.

ఇద్దరి పరిస్థితి ఒకేలా వుంది.

ఏదో బాధ- ఏమిటది? మనసు అదుపు తప్పింది.

ఎంతో అనుకున్నాడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు పరిస్థితి మార్చాలని... కానీ తనవల్ల కావడం లేదు.

ఇలా జరుగుతుందని తను అనుకోలేదు.

అయింది-

అనుకోనిది జరుగుతుంది కనుకే 'జీవితం' అంటారేమో.

లేకపోతే తన స్నేహితుడు ప్రేమించే అమ్మాయితో తను ప్రేమలో పడడమా-

క్షమించరానిది.

నేరం... ఘోరం.

ఇంతకంటే పాపం కూడా వుండదేమో.

"దేని గురించి స్వరూప్ అంతలా ఆలోచిం చేస్తున్నావు" ఆ మౌనాన్ని భరించలేక అనేసింది ఉష.

"నేనెటువంటి మనిషిని అని... కరుణాకర్‌కు నామీద ఎంత నమ్మకం. ఆ నమ్మకంతోనే నిన్ను చూస్తుండమన్నాడు"

"ఇందులో నీ ఒక్కడి తప్పే ఎలా వుంటుంది. ఒకవేళ వున్నా అందులో నాకూ భాగం వుంది... మనకి తెలియకుండానే దగ్గరయ్యాం"

కరుణాకర్ ఉషను పెళ్ళాడాలనుకున్నాడు. ఇంతలో పై చదువులకు అమెరికా వెళ్ళాల్సి వచ్చింది. వచ్చాక పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. ఉష 'అలాగే' అంది.

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళినప్పుడు కూడా కరుణాకర్ అన్నాడు "తరచు ఉత్తరాలు వ్రాస్తుండమని"

ఆ సమయంలో స్వరూప్ కూడా వాళ్ళతోనే వున్నాడు.

వెళ్ళిపోయేముందు ఉషను గట్టిగా తన గుండెలకు హత్తుకున్నాడు కరుణాకర్- "నువ్వేం బెంగ పెట్టుకోకు. స్వరూప్‌కు చెప్పాను నీ వెల్ఫేర్ చూస్తుండమని"

కరుణాకర్, ఉషల పరిచయం చాలాకాలం క్రితంనుంచీ వుంది.

కరుణాకర్ పనిచేసే చోటే ఉష సెక్రటరీగా చేరింది.

ఆరోజు ఉష ఆఫీసుకు రాలేదు. ఎవరిద్వారానో లీవ్ లెటర్ పంపింది ఒంట్లో బావుండలేదని, ఆఫీసుకు రావడం లేదని.

విషయం తెలిసిన వెంటనే ఇంటికి బయలుదేరాడు.

ఆమె మంచంమీద పడుకుని వుంది.

ఆ సమయంలో తల్లి ఆమె దగ్గరికొచ్చి చెప్పింది "అమ్మా ఉషా నీకోసం ఎవరో వచ్చారు"

"లోపలికి రమ్మని చెప్పు" ఉష నీరసంగా అంది.

కరుణాకర్‌ను చూడగానే ఉష ముఖం వికసించింది.

"మీకు ఆరోగ్యం బాగాలేదని తెలిసింది. రాకుండా వుండలేకపోయాను. ఇప్పుడెలా వుంది"

"ఇప్పుడు ఫరవాలేదు... మీకు అనవసరమైన శ్రమ"

"శ్రమ ఎలా అవుతుంది"

ఆమె ముఖంలో ప్రశ్న.

"మీరు ఆఫీసుకు రాకపోవడం చాలా వెలితిగా వుంటోంది. మీరు లేకపోతే ఆఫీసులో పని అసలు కదలడం లేదు"

మంత్రవాది మహేశ్వర్

"నామీద అభిమానానికి కృతజ్ఞతలు. అయితే ఆఫీసులో చాలామంది అమ్మాయిలు చురుకైనవాళ్ళేనే"

"అలా కాదనుకోండి..." నసిగాడు.

"పేరుతో పిలవాలని- 'నువ్వు' అంటూ ఏకవచన సంబోధన చేయాలని అనిపిస్తోంది. ఏమనుకోవు కదా"

ఓ క్షణం మౌనం.

"నిన్ను అస్తమానం చూడడానికి వస్తే ఏమీ అనుకోవు కదా"

"ఎందుకనుకుంటాను" నవ్వింది ఉష.

అదే సమయంలో స్వరూప్ వచ్చాడక్కడికి.

ముగ్గురూ కలిసి మాట్లాడుకున్నారు చాలాసేపు.

* * *

ఉష ఆరోగ్యం బాగుపడి ఆఫీసుకు వెడుతోంది.

కరుణాకర్‌తో ఆమెకు చనువు కొస్త ఎక్కువైంది. ఉషను ఇంటిదగ్గర డ్రాప్ చేయడం, తరచు పికప్ చేసుకోవడం... కరుణాకర్ మంచి మర్యాదలు, సభ్యతాసంస్కారాలు తెలిసి ఉష తల్లి కూడా తప్పుగా భావించలేదు.

కొన్ని కొన్నిసార్లు ఉష కరుణాకర్‌తోపాటు స్వరూప్ కలిసి తిరుగుతుండేవారు.

ఒకరోజు-

'అశోకా' హోటల్..

సన్నగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది.

ఎప్పుడూ కూర్చునే చోటులోనే కూర్చున్నారు.

ఇద్దరి మధ్యా మౌనం.

చల్లటి వాతావరణం ఒళ్ళంతా సోకి ఏదో హాయిని కలిగిస్తోంది.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం" పాత మాటనే కొత్తగా చెప్పాడు కరుణాకర్.

"..." ఉష నవ్వింది.

"నీకు" అతనే అన్నాడు.

"...." మళ్ళీ నవ్విందామె.

"చెప్పవా" జాలిగా అడిగాడు.

"ఊ.. నాకూనూ... అయినా ఎవరైనా అలా అడుగుతారేమిటి" సిగ్గుతో.

ఉషకు తెలుసు. తన భర్త స్థానాన్ని కరుణాకర్‌కు ఇస్తే ఎవరికీ ఏ అభ్యంతరమూ వుండదని... తల్లికీ ఇష్టమే.

ఆ మసక చీకటిలో-

అతని చేయి ఆమె చేయిని వెతికి పట్టుకుంది.

ఒకరి కళ్ళలోకి ఒకరు.

ఆ చేయి అతని చేతుల్లో అలా ఎంతసేపో....

"నేను అమెరికానుంచి రాగానే పెళ్ళి చేసుకుంటాను.. నీకేం ఇబ్బంది లేదు కదా"

"ఊహూ.'

.........

"నీ గురించి ఎంతకాలమైనా ఎదురుచూస్తాను" ఉష అంది మరో క్షణం తరువాత.

"నాకు చాలా సంతోషంగా వుంది ఉష–"

కాసేపటికి స్వరూప్ రావడం, ముగ్గురూ టిఫిన్ చేయడం అయింది.

కరుణాకర్ విదేశానికి వెళ్ళాక ఉత్తరాలు అటూ ఇటూ ప్రయాణం చేస్తూనే వున్నాయి.

తరువాత తరువాత కరుణాకర్ నుంచి ఉత్తరాలు అంత వెంటవెంటనే రాకపోవడంతో ఉష అర్థం చేసుకుంది– అతని చదువువల్లా దానివల్లా అని.

ఉష ఒంటరిగా బాధపడకుండా వుండడానికి స్వరూప్ పరిచయం దోహదపడింది.

ఒక ఏడాది గడిచింది.

అంతవరకూ బానే వుంది... అక్కడ్నించీ సమస్యలు తలెత్తడం మొదలైంది.

ఉష స్వరూప్‌ను ఎప్పుడూ తమ ఫామిలీ ఫ్రెండ్ గానే భావిస్తూ వస్తోంది.

అతని అందమైన విగ్రహం, మాటతీరు ఎందరో అమ్మాయిల్ని ఆకర్షించింది. అయితే స్వరూప్ ఎవరినీ తన అర్థాంగిగా ఊహించలేదు. తను కోరుకున్న అమ్మాయి దొరకలేదు.

తను కోరుకునే అమ్మాయికి వుండాల్సిన లక్షణాలన్నీ ఉషలో వున్నాయనుకున్నాడు స్వరూప్.

ఉషతో వుంటే స్వరూప్‌కు టైమ్ తెలియదు.

ఎంతసేపైనా అలాగే వుండిపోవాలనిపిస్తుంది.

ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అభిమానం ఏర్పడింది.

ఒకరికి తెలియకుండా మరొకరు 'ప్రేమ'లో పడ్డారు.

ఇద్దరూ అర్థం చేసుకున్నారు.

అయితే– ఇద్దరిలోను ఏదో చెప్పలేని 'వెలితి', 'గిల్టి'.

ఉష కరుణాకర్‌కు చెందుతుంది.

అయినా ఎందుకో ఆమె అంటే ఇష్టం ఏర్పడింది.

మనసు ఎందుకు మారడం లేదు?

ఉష కూడా ఎందుకంత ఇష్టపడుతోంది.

కరుణాకర్‌తో రాగానే వివాహం అని మనస్ఫూర్తిగా నిర్ణయించుకోవడం అయితే అయిపోయింది.

మరిప్పుడు ఈ ఆలోచనలు ఇలా ఎందుకు మారాయి.

కాల ప్రభావమా?

పరిస్థితులా...


ఒంటరితనమా...

ప్రస్తుతం– ఉష కరుణాకర్‌ను ఊహించలేకపోతోంది. అతనిని గురించిన ఆలోచన స్థానంలో స్వరూప్ కనిపిస్తున్నాడు.

ఒకరోజున స్వరూప్ "నీ దగ్గర ఇంక దాచలేను. నిన్ను ప్రేమిస్తున్నాను" అనేశాడు.

ఉష కూడా అతనిపట్ల ఇష్టాన్ని వ్యక్తపరచింది.






స్వరూప్ కూడా పొంగిపోయాడు.

"నిజమే... కరుణాకర్‌తో పెళ్ళి అనుకోవడం అనుకున్నాం. ఇప్పుడు ఎలాగ... ఏం చేద్దాం"

"కరుణాకర్‌తో వచ్చేదాకా నిరీక్షిస్తాము అన్నాను. నిజమే... కానీ..."

ఇద్దరిలోనూ ఇవే ఆలోచనలు.

కరుణాకర్ తిరిగి వచ్చినప్పుడు–?

ఏం చెప్పాలి... ఎలా రిసీవ్ చేసుకోవాలి...

వరండాలో కూర్చుని ఇద్దరూ ఆలోచనలతో సతమతమవుతున్న సమయంలో ఉష తల్లి ఓ ఉత్తరం పట్టుకొచ్చింది "ఇదిగోనమ్మా... కరుణాకర్ నుంచి లాగుంది"

ఓ నిట్టూర్పుతో ఉత్తరం అందుకుంది.

బహుశా వచ్చేదెప్పుడో వ్రాసివుంటాడనుకుని చింపింది.

చేతివేళ్ళు వణకడం ప్రారంభించాయి.

"ఏం ఉషా... కరుణాకర్ రావడం లేదా" స్వరూప్.

"నువ్వే చదువు.. " స్వరూప్ కిచ్చింది.

డియర్ ఉషా,

నాకు ఉత్తరం ఎలా ప్రారంభించాలో తెలియడం లేదు. ఓ పదిసార్లయినా వ్రాసి సరిగా లేదనుకుని చింపి పారేసుంటాను. కానీ తప్పడం లేదు. ఆత్మను నిగ్రహించుకుని వ్రాయాల్సి వస్తోంది.

ఉషా, నేనో పని చేశాను... అది నీ కిష్టముండదని తెలుసు... ఇక్కడో అమ్మాయి ప్రేమలో పడ్డాను... మా నైబర్స్... నీతో పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చి నేనిక్కడ ఇలా చేయడం తప్పే...

ఉషా, నువ్వు ఎంతో తెలివిగలదానికి, సంస్కారమున్నదానివి. ప్రేమించిన ఆ హృదయంతోనే ఈ మూర్ఖుణ్ణి క్షమించు.

క్షమిస్తావు కదూ... అలా అని వ్రాస్తేనే నా హృదయం తేలికపడుతుంది.

నేనెంత సిగ్గుతో కుమిలిపోతున్నానో వ్రాయలేను. కానీ ఒక్క విషయం–

ఎంతోకాలంగా ఇద్దరినీ వేధించిన సమస్య ఈ రకంగా పరిష్కరింపబడుతుందని అనుకోలేదు.

"మనం సమస్యను పరిష్కరించుకోలేని పరిస్థితులొచ్చినపుడు ఆ భగవంతుడే దారి చూపెడతాడు" అని అమ్మ ఎప్పుడో ఏదో విషయంలో అన్న మాటలు గుర్తొచ్చాయి ఉషకి.

నువ్వు ఎవరినైనా– నాలాంటి మూర్ఖుణ్ణి కాకుండా మంచివాణ్ణి చూసి పెళ్ళి చేసుకో... అప్పుడే నేను నా ముఖం నీకు చూపించగలుగుతాను.

వుంటాను...

నీ

కరుణాకర్

స్వరూప్ ఆ ఉత్తరాన్ని ఆమెకిస్తూ ఆమె కళ్ళల్లో తిరిగిన నీళ్ళను చూశాడు.

నిజమే అవి నీటిబిందువులే.

మనసుకు కలిగిన ఊరటకు ఫలితంగా వచ్చినవా...?

ఏమైతేనేం–

## మహామహుల ముచ్చట్లు!



ఒకసారి గాంధీజీ కొన్నాళ్ళపాటు నిరాహార దీక్షను పూనారు. దీక్ష ముగిసిన తర్వాత, పటేల్‌ను రోజువారీ ఆశ్రమంలో అయిన ఖర్చుల జాబితాను అడిగారు. వెంటనే పటేల్ "బాపూ! నేను ఖర్చులకు జాబితా తయారుచెయ్యలేదు. ఈ దీక్షలో మీరు చనిపోతారని నేను భావించాను. అందువలన మీకు లెక్కలు చెప్పవలసిన అవసరం వుండదుగదా! కనుకనే ఆ ఖర్చులు నేను వ్రాయలేదు!" అన్నారు గంభీరంగా. ఆ సమయంలో అక్కడున్న ప్రముఖులందరూ పకాలున నవ్వారు. వారితో బాపూజీ కూడా శ్రుతి కలిపారు.



నెహ్రూజీ ఒక పెద్ద భవనంలో నివశించినప్పటికీ, ఆయన జీవన విధానం మాత్రం నిరాడంబరంగా వుండేది. తన భవనంలోని లిఫ్ట్‌ను ఆయన ఎప్పుడోగానీ ఉపయోగించేవారు కాదు! ఒక రోజున కృషిభవన్‌లో ఏర్పాటైన ప్లానింగ్ కమీషన్ సమావేశానికి వెళ్ళారు జవహర్. అక్కడ లిఫ్ట్ కోసం ఎదురు చూస్తున్న షుమారు ఒక వందమంది క్యూలో నిలబడి వుండడం చూసి నెహ్రూజీ ఆశ్చర్య పడ్డారు.

"యువకులకు పైకి వెళ్ళడానికి లిఫ్ట్‌తో అవసరం ఏముటుంది? వాళ్ళు మెట్లమీద నుంచి వెళ్తే, కాలం కలిసొస్తుంది గదా!" అని క్యూలో నిలబడివున్న యువకుల్ని మందలించారు. వెంటనే ఆ యువకులు రివ్వున ఎగిరే పావురాళ్ళలా మెట్లవైపు వెళ్ళారు.